నవ్వనైనా లేదు. ఇప్పుడు బూట్లు వేసుకుని వస్తే వాలంటీర్, స్వామి శిష్యుడు, ప్రధాన శిష్యుడు కూడా వచ్చి పలకరించారు."

చెప్పి అతను లేచి వెళ్ళి బూట్లు విప్పి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు.

పవిత్ర నదిలో ఎలా స్వచ్ఛమైన నీటి అడుగున అశుద్ధమైన బురద ఉంటుందో, అలా మహాత్ముల సన్నిధిలో నివశించేవారిలో ప్రేమరాహిత్యం గలవారూ ఉంటారు. ఎదుటివారు తప్పు చేస్తేనే వారు మాట్లాడతారు.

## 37. పూజ

దైవ భక్తి గల ఓ సామాన్యుడు ఓ మహాత్ముడు చెప్పే ప్రవచనాన్ని శ్రద్ధగా వింటున్నాడు. మధ్యలో ఆయన ఇలా చెప్పాడు.

"...కాబట్టి స్తోత్రాలు, కీర్తనలతో కాలక్షేపం చేసే కన్నా మనం మన పనిని నిర్లక్ష్యం చెయ్యకపోవడం వల్ల దేవుడి అనుగ్రహానికి పాత్రులమవుతాం. మన పనిని మనం శ్రద్ధగా చెయ్యడం నిజమైన పూజ. తర్వాతే స్తోత్రాలు, కీర్తనలు."

ఆ ప్రవచనం పూర్తయ్యాక ఆ సామాన్యుడు లేచి ఆ మహాత్ముడి దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"స్వామి! ఇందాక మీరు చెప్పిందాంట్లో నాకు ఒకటి బోధ పడలేదు. దేవుడ్ని స్తుతించడం కన్నా ఎవరి పనిని వారు చేయడం గొప్ప పూజ అన్నారు. కాని కలికాలంలో ఒక్క నామస్మరణ చాలని విన్నాను. ఈ రెంటిలో దేన్ని నమ్మమంటారు?"

"సరే. ఈ సాయంత్రం నాతో వ్యాహ్యాళికి రా. అక్కడ నీ సందేహాన్ని తీరుస్తాను." ఆ మహాత్ముడు చిరునవ్వుతో చెప్పాడు.

సాయంత్రం ఆ మహాత్ముడు వ్యాహ్యాళికి వెళ్ళే సమయంలో అతను ఆయన దగ్గరకి వెళ్ళాడు. ఇద్దరూ ఆశ్రమ తోటలో నడవసాగారు.

ఆ తోటని చూసుకునే ఇద్దరు తోటమాలుల్లో ఒకడు దూరంగా చెట్ల పాదుల్లో రాలిన ఆకులని ఏరేసి చుట్టూ మట్టి కట్ట కడుతూ కనిపించాడు. అతను దూరం నించే ఆ మహాత్ముడికి ఓ నమస్కారం చేసి మళ్ళీ తన పనిని తను

చేసుకోసాగాడు. కొద్ది దూరం వెళ్ళాక వాళ్ళకి రెండో తోటమాలి కూడా కనిపించాడు. వాళ్ళని చూడగానే అతను దూరం నించే 'నమస్కారం స్వామి'అని రెండు చేతులు ఎత్తి దణ్ణం పెడుతూ పరిగెత్తుకు వచ్చాడు.

"స్వామి! మీరు చెప్పే ప్రవచనాలతో ప్రజల్లో దైవ భక్తి బాగా పెరుగుతోందని ఊరంతా అనుకుంటున్నారు..." అంటూ ఆ మహాత్ముడ్ని పొగడసాగాడు.

"అది సరే. నీ అన్న చెట్లకి పాదులు చేస్తూంటే నిన్ను పక్కనే ఉండి వెంటనే నీళ్ళు పోయమన్నాగా? ఆ పని చేయడం లేదే?" ప్రశ్నించాడు మహాత్ముడు.

జవాబుగా నీళ్ళు నమిలాడు వాడు.

"నీకు బద్ధకం పెరిగి పని మీద శ్రద్ధ తగ్గింది. ఇలా అయితే నిన్ను పన్లోంచి తీసేస్తాను." మందలించాడాయన.

ముందుకి సాగాక చెప్పాడు మహాత్ముడు.

"చూసావుగా? వాడు ఒళ్ళు వంచి పని చెయ్యడు. నన్ను పొగిడి మాటలతో బుట్టలో వేసుకోవాలనుకుంటాడు. అందుచేత వాడంటే నాకిష్టం లేదు. వీడి అన్న నేను చెప్పిన పనిని శ్రద్ధగా చేస్తాడు కాబట్టి వాడంటే నాకిష్టం."

వెంటనే ఆ సామాన్యుడు చెప్పాడు.

"స్వామీ! ఇప్పుడు మీ బోధ నాకు బాగా అర్థమైంది. దేవుడి అనుగ్రహం సంపాదించాలంటే ఆయన్ని స్తుతించడం కన్నా, ఆయన మనకి ఇక్కడ నిర్దేశించిన పనిని శ్రద్ధగా, తప్పుల్లేకుండా చేయడం కంటే మించిన పూజ లేదు అని ఒప్పుకుంటున్నాను."

## 38. సందర్భోచితం

జీర్ణావస్థలో వున్న ఓ పురాతన రామాలయాన్ని కొందరు కలిసి పునరుద్ధరించారు. దాని ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఓ రామ భక్తుడ్ని ఆహ్వానించారు. సభలో చాలామంది వక్తలు మాట్లాడారు. రామాలయాన్ని పునరుద్ధరించడానికి తోడ్పడిన మనుషులని పొగిడారు. పాలక మండలి అధ్యక్షుడు